సాక్షి ఆదిలాబాద్

ఆదివారం । 28 । ఏప్రిల్ । 2024



'శుభ' విరామం..!
గురుమూఢం ప్రారంభమవుతుండగా ఆదివారం నుంచి శుభకార్యాలకు బ్రేక్ పడనుంది. జూలై 8వ తేదీ వరకు శుభ ముహూర్తాలు లేవని పండితులు చెబుతున్నారు. 8లో▸



చేతిపంపులే ఆధారం 9లో▸
భూగర్భ జలాలు అడుగంటి మిషన్ భగీరథ నీరు సరిగా సరఫరా కావడంలేదు. నీటి ఎద్దడి నివారణకు ప్రభుత్వం వృథాగా మారిన చేతిపంపులకు మరమ్మతు చేయిస్తోంది.

వాతావరణం
గరిష్టం/కనిష్టం
41.0 /29.0
ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. పలుచోట్ల ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉదయం అక్కడక్కడా చిన్నపాటి వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

1నుంచి సైన్స్ శిక్షణ శిబిరం

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తి పెంచేందుకు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మే 1నుంచి 7వ తేదీ వరకు ఉచిత వేసవి సైన్స్ శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు వేదిక అధ్యక్షుడు బెదుడ్కర్ సంతోష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి చదివే విద్యార్థులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. శిక్షణ శిబిరాన్ని పట్టణంలోని సంస్కార్ ఉన్నత పాఠశాలలో ఉదయం 8.30నుంచి 10.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9491558760 నంబర్‌లో సంప్రదించాలని సంతోష్ సూచించారు.

పోల్‌చీటీల పంపిణీ పర్యవేక్షణకు ప్రత్యేకాధికారులు

కైలాస్‌నగర్: ఈ నెల 25నుంచి మే 8వ తేదీ వరకు ప్రతీ పోలింగ్‌స్టేషన్ పరిధిలో బూత్ స్థాయి అధికారుల ద్వారా ఓటరు సమాచార స్లిప్‌లు పంపిణీ చేయనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రక్రియను పర్యవేక్షించేందుకు నియోజకవర్గాలతో పాటు జిల్లా స్థాయిలో పర్యవేక్షణ సెల్‌లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ మానిటరింగ్ సెల్ ఇన్‌చార్జి అధికారిగా సంపతి శ్రీనివాస్ (ఆదిలాబాద్ అర్బన్ తహసీల్దార్)ను, బోథ్ నియోజకవర్గ సెల్ ఇన్‌చార్జి అధికారిగా జీ తుకారాం (ఇచ్చోడ తహసీల్దార్)ను నియమించినట్లు తెలిపారు. వీరిని 7670858440, 9440995663 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. జిల్లా స్థాయి ఫిర్యాదులకు కలెక్టరేట్‌లో 1950-1800 425 1939 టోల్ ఫ్రీ నంబర్లను సంప్రదించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి



పనులు పరిశీలిస్తున్న పీడీ సాయన్న

తాంసి: ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్య మరింత పెంచాలని డీఆర్డీవో సాయన్న అధికారులకు సూచించారు. శనివారం మండలంలోని పొన్నారి గ్రామ శివారులోగల చెరువు పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. కూలీల వివరాలు, హాజరు నమోదు, మట్టి తరలింపు వివరాలు తెలుసుకున్నారు. పని ప్రదేశంలో కూలీలకు కల్పిస్తున్న వసతులపై ఆరా తీశారు. తాగునీరు, నీడ వసతి కల్పించాలని, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూలీలకు వివరించారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఉదయం పూట పనులు చేపట్టేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో మోహన్‌రెడ్డి, ఏపీవో విజయ, టీఈ రాజన్న, ఫీల్డ్ అసిస్టెంట్ స్వామి ఉన్నారు.

ఆదిలాబాద్ ఆర్వోపై ఈసీకి ఫిర్యాదు

ఆదిలాబాద్‌టౌన్: ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పూర్తి వివరాలు నమోదు చేయకుండా దాఖలు చేసిన బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్ నామినేషన్‌ను ఆమోదించిన ఆదిలాబాద్ రిటర్నింగ్ అధికారి రాజర్షిషాపై చర్య తీసుకోవాలని బీఆర్‌ఎస్ విజ్ఞప్తి చేసింది. ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు దాసోజు శ్రావణ్ శనివారం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్‌ను కలిసి ఫిర్యాదు చేసినట్లు పార్టీ జిల్లా నాయకులు తెలిపారు.

'బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థుల మాటలు నమ్మొద్దు'



మాట్లాడుతున్న భోజారెడ్డి

కైలాస్‌నగర్: బీజేపీ, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థులు గోడం నగేశ్, ఆత్రం సక్కు మాటలు నమ్మొద్దని, గతంలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులుగా ఉండి వారు ప్రజలకు చేసిందేమీ లేదని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి ఆరోపించారు. ఇప్పుడు మరోసారి మోసం చేసేందుకు వస్తున్నారని విమర్శించారు. శనివారం స్థానిక కంది ప్రజాసేవ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. మొన్నటిదాకా అధికారంలో ఉండి రైతులకు రుణమాఫీ చేయలేని బీఆర్‌ఎస్‌కు, పదేళ్లు కేంద్రంలో అధికారంలో ఉన్నా ప్రజాసంక్షేమాన్ని విస్మరించిన బీజేపీకి ఓట్లు వేయొద్దని కోరారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట పట్టణాధ్యక్షుడు గుడిపెల్లి నగేశ్, కౌన్సిలర్లు కలాల శ్రీనివాస్, దర్శనాల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ర నేతలొస్తున్నారు!

- ప్రచార కార్యాచరణ తయారీలో పార్టీలు
- నిర్మల్‌కు త్వరలో అగ్రనేత రాహుల్
- కాగజ్‌నగర్, ముథోల్‌కు యోగి లేదా షా
- ఇప్పటికే ఆదిలాబాద్‌కు వచ్చిన రేవంత్
- క్యాడర్‌లో జోష్ నింపిన మోదీ పర్యటన



కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ

యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్

సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, ఆదిలాబాద్: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్నాయి. వివిధ రాజకీయ పార్టీలు ప్రచార వేగం పెంచాయి. ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకునేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నాయి. ఇప్పటికే బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రచారంలో బీఆర్‌ఎస్ కొంత వెనుకబడినట్లు కనిపిస్తోంది. కాగా, కమలం, హస్తం పార్టీల నుంచి అగ్రనేతల పర్యటనకు సంబంధించి ప్రణాళిక రూపొందిస్తున్నారు. వారం రోజుల్లోనే వారి పర్యటనలు ఉండే అవకాశం ఉంది.

ఓటర్ల ప్రసన్నం కోసం పాట్లు

ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు వివిధ పార్టీల ఎంపీ అభ్యర్థులు నానా పాట్లు పడుతున్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. నిత్యం ఒకట్రెండు నియోజకవర్గాలు టచ్ చేస్తూ ఆయా పార్టీల అభ్యర్థులు తమ ప్రచార పర్వం కొనసాగిస్తున్నారు. బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్, కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ ప్రచారంలో దూసుకుపోతున్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు ప్రచార పర్వంలో కొంత వెనుకబడ్డారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాగా, ప్రతీ బూత్ స్థాయిలో ప్రజలను కలవాలని బీజేపీ నేతలు పార్టీ కార్యకర్తలను ఆదేశించారు. ప్రధానంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించాలని సూచిస్తున్నారు. ప్రధాని మోదీ మళ్లీ అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ ఓట్లు అభ్యర్థించాలని చెబుతున్నారు. బీజేపీ సంకల్ప్ పత్ర్ మేనిఫెస్టో గురించి జనాలకు వివరించాలని ఆదేశిస్తున్నారు. బూత్ స్థాయిలో ప్రతీ ఓటరును కలవాలని పార్టీ నేతల నుంచి ఆదేశాలు ఉండడంతో కాంగ్రెస్ కార్యకర్తలు కూడా విస్తృతంగా పర్యటిస్తున్నారు. ప్రధానంగా ఓటర్లను కలిసినప్పుడు రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసిన గ్యారంటీల గురించి వివరిస్తున్నారు. కాంగ్రెస్ విడుదల చేసిన మేనిఫెస్టో న్యాయ్‌పత్ర్‌ను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు.

అగ్రనేతల పర్యటన ఉండేలా..

ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో బీజేపీ, కాంగ్రెస్ ప్రచారంలో భాగంగా ఆయా పార్టీల అగ్రనేతలను రప్పించేందుకు వ్యూహరచన చేస్తున్నారు. ఆదిలాబాద్‌లో ఇప్పటికే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటించి క్యాడర్‌లో జోష్ నింపారు. దీంతో బీజేపీ నేతలు, కార్యకర్తలు ప్రచారంలో ఉత్సాహంగా ముందుకుసాగుతున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఆదిలాబాద్‌లో పర్యటించి క్యాడర్‌కు దిశానిర్దేశం చేశారు. కాగా, మే 5వ తేదీలోగా నిర్మల్‌కు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ రానున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు పలువురు రాష్ట్ర మంత్రులు ఈ సభలో పాల్గొననున్నారు. పార్టీ ఇందుకు సంబంధించి ప్రణాళిక రూపొందిస్తోంది. త్వరలోనే ఈ పర్యటన పూర్తి స్థాయిలో ఖరారు కానుంది. కాగా, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా లేదా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పర్యటించే అవకాశముంది. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్, నిర్మల్ జిల్లా ముథోల్‌లో సభలు నిర్వహించాలని బీజేపీ ప్లాన్ చేస్తోంది. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా బీజేపీ పర్యటనలో పాల్గొననున్నారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

'ప్రజల పక్షాన పోరాడుతాం'



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: ప్రజాసమస్యలపై ప్రజల పక్షాన ఉండి ప్రభుత్వంపై పోరాడుతామని మాజీ ఎమ్మెల్యే మంత్రి జోగు రామన్న పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కుతో కలిసి పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబేద్కర్, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. సమస్త ప్రజానీకం మద్దతుతో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ తన ప్రాణాన్ని కూడా లెక్క చేయకుండా స్వరాష్ట్ర సాధనకు పోరాడారని గుర్తు చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలిచ్చిన తీర్పే అంతిమమన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళ్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రోకండ్ల రమేశ్, యూనుస్ అక్బానీ, అష్రఫ్, అలాల్ అజయ్, గండ్రత్ రమేశ్, సాజిదొద్దీన్, లింగారెడ్డి, రాంకుమార్, స్వరూపారాణి, బోడగం మమత పాల్గొన్నారు.

మహనీయుల ఆశయసాధనకు పాటుపడాలి

ఆదిలాబాద్‌టౌన్: మహనీయుల ఆశయసాధనకు ప్రతిఒక్కరూ పాటుపడాలని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని సుభాష్‌నగర్‌లో సారిపుత్త బుద్ధ విహార్ కమిటీ, యువ సంఘటన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. గౌతమ బుద్ధుడు, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో అన్నెల వసంత్, చంద్రశేఖర్ భగత్, అవినాష్ పాటిల్, వినోద్ పరేకార్, దమ్మపాల్ జీవనే, ప్రశాంత్ తెలంగ్, లోకేశ్ పాటిల్, దీపక్ కానిండే పాల్గొన్నారు.

'హామీల అమలులో కాంగ్రెస్ విఫలం'



మాట్లాడుతున్న గోడం నగేశ్

గుడిహత్నూర్: కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందని బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ ఆరోపించారు. శనివారం గుడిహత్నూర్ మండల కేంద్రంలో బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తే విజయం సాధ్యమని, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్, పార్లమెంట్ కో కన్వీనర్ మయూర్‌చంద్ర, వైస్ ఎంపీపీ భరత్, కేంద్రే శివాజీ, సధాకర్‌రెడ్డి, లక్ష్మణ్ కేంద్రే పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సంక్షేమం బీజేపీతోనే సాధ్యమని ఆదిలాబాద్ బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్ పేర్కొన్నారు. శనివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని తిరుమల ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సమావేశానికి హాజరై మాట్లాడారు. దశాబ్ద కాలంగా ప్రధానమంత్రి మోదీ నేతృత్వంలో గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. అందరికీ సమాన అవకాశాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఉట్నూర్‌లోని గోండుల కోట అభివృద్ధికి కేంద్రం నిధులు మంజూరు చేసిందని తెలిపారు. జోడేఘాట్‌లో 275 ఆర్టికల్ ద్వారా నిధులు మంజూరు చేసిందని, సమ్మక్క సారక్క, రామప్ప దేవాలయాల అభివృద్ధి కృషి చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రాథోడ్ రితేశ్, రాజు, అరుణ్‌లాల్, విజయ్, అయ్యన్నగారి భూమయ్య, కనక తుకారాం, ధన్‌లాల్ నాయక్, కొండేరి రమేశ్, సతీశ్, బొడ్డుకిరణ్, బద్రి, లింగాగౌడ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

జిల్లాలో 4,56,450 మంది ఓటర్లు

- ఓటర్ల అనుబంధ జాబితా విడుదల
- పురుషుల కంటే మహిళలే అధికం
- కొత్తగా రెండువేల ఓట్లు నమోదు



కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఓటర్ల లెక్క తేలింది. జిల్లాలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 4,56,450 మంది ఓటర్లున్నట్లు అధికారులు తేల్చారు. ఇందులో పురుష ఓటర్లు 2,22,306 మంది, మహిళా ఓటర్లు 2,34,135 మంది, ఇతరులు తొమ్మిది మంది ఉన్నారు. జిల్లాలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 11,829 మంది అధికంగా ఉన్నారు. ఫిబ్రవరి 8వ తేదీన ఓటర్ల తుది జాబితా ప్రకటించగా జిల్లాలో మొత్తం 4,54,450 మంది ఓటర్లున్నారు. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్‌ను కేంద్ర ఎన్నికల సంఘం మార్చి 16న విడుదల చేసింది. ఈ నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు కల్పించాలనే ఉద్దేశంతో కొత్తగా ఓటరు నమోదుకు అవకాశం కల్పించింది. మార్చి 16 నుంచి ఈ నెల 15వ తేదీ వరకు 1 ఏప్రిల్ 2024 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశమిచ్చింది. నెల వ్యవధిలో దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను జతచేస్తూ ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం-2024లో భాగంగా అనుబంధ ఓటర్ల జాబితాను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ జాబితాను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా శనివారం ప్రకటించారు. జాబితాను కలెక్టర్ కార్యాలయం, ఆదిలాబాద్, బోథ్ రిటర్నింగ్ అధికారులైన ఆర్డీవో కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాలతో పాటు జిల్లాలోని 502 పోలింగ్ కేంద్రాల్లో ప్రదర్శించనున్నారు. అలాగే బూత్ లెవల్ అధికారుల (బీఎల్వో)ల వద్ద కూడా అందుబాటులో ఉంచనున్నారు.

పాతవి.. పెరిగినవి ఇలా..

ఈ ఏడాది ఫిబ్రవరి 8వ తేదీన విడుదల చేసిన ఓటర్ల జాబితాతో పోల్చితే ఆదిలాబాద్ జిల్లాలో కొత్తగా 2వేల మంది ఓటర్లు అదనంగా పెరిగారు. ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో 1,602 మంది ఓటర్లు పెరగగా, బోథ్ నియోజకవర్గంలో 398 మంది కొత్తగా నమోదయ్యారు. తుది ఓటర్ల జాబితా ప్రకారం ఆదిలాబాద్ నియోజకవర్గంలో 2,45,137 మంది, బోథ్ నియోజకవర్గంలో 2,11,313 మంది ఓటర్లున్నారు. కాగా, ఆయా నియోజకవర్గాల్లో పురుషులు, మహిళలు, ఇతరులు ఎంత మంది కొత్తగా నమోదయ్యారనే వివరాలు అధికారులు ఇంకా వెల్లడించలేదు.

యువతే దేశానికి వెన్నెముక



ఆదిలాబాద్‌లో మాట్లాడుతున్న పాయల్ శంకర్

ఆదిలాబాద్‌టౌన్: యువత దేశానికి వెన్నెముక లాంటివారని ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని ఓ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన యువ సమ్మేళనం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీలోనే యువత అత్యధికంగా ఉన్నట్లు తెలిపారు. మరోసారి మోదీని ప్రధానిగా చేయాలంటే ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానాన్ని గెలిపించుకునేందుకు యువత చిత్తశుద్ధితో పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, నాయకులు సురేశ్‌గౌడ్, నగేశ్, మయూర్ చంద్ర, పాయల్ శరత్, వెంకటేశ్, సూచిత్, అశోక్ ముస్తాపూర్, రఘుపతి, కృష్ణ యాదవ్, హేతేంద్ర నాథ్ యాదవ్, నిఖిల్, రాకేశ్ తదితరులున్నారు.

బీజేపీ గెలుపు ఖాయం

ఇచ్చోడ: ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ గెలుపు ఖాయమని ఎమ్మెల్యే పాయల్ శంకర్ ధీమా వ్యక్తంజేశారు. శనివారం సాయంత్రం స్థానిక బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బీజేపీకి గ్రామగ్రామాన ఆదరణ లభిస్తోందని చెప్పారు. మూడోసారి మోదీని ప్రధానిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, పార్లమెంట్ కోఆర్డినేటర్ ముస్తాపూర్ అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు కదంబారావు, మాదవ్ ఆమ్టె, కార్యదర్శి కొల్లూరి చంద్రశేఖర్, మండలాధ్యక్షుడు కేంద్రే నారాయణ, ప్రధాన కార్యదర్శి రమేశ్, నాయకుడు రాము తదితరులున్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి




కళాశాలల డైరెక్టర్లు, ప్రిన్సిపాల్‌లతో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: వైద్యవిద్యలో ఉత్తమ ఫలితాలు సాధించాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) వాణి సూచించారు. శనివారం హైదరాబాద్‌లో గాంధీ మెడికల్ కళాశాలలో రాష్ట్రంలోని అన్ని మెడికల్ కళాశాలల డైరెక్టర్లు, ప్రిన్సిపాల్‌లతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆదిలాబాద్ రిమ్స్ మెడికల్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ జైసింగ్ రాథోడ్ హాజరయ్యారు. సమావేశంలో వాణి మాట్లాడుతూ.. విద్యార్థుల హాజరును మెరుగుపర్చాలని, ఉత్తమ ఫలితాలు సాధించాలని, బయోమెట్రిక్ అటెండెన్స్‌ను పూర్తి స్థాయిలో అమలు చేయాలని సూచించారు. కళాశాల అభివృద్ధికి కృషి చేయాలని, యూజీ, పీజీ విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధించాలని ఆదేశించారు.

ప్రచారంపై భానుడి సెగ

- ఓటర్లను కలిసేందుకు అభ్యర్థుల పాట్లు
- ఎండలో తిరిగేందుకు క్యాడర్ వెనుకంజ
- ప్రధాన పార్టీల్లో కనిపించని ప్రచార జోష్
- సమావేశాలతోనే సరిపెడుతున్న పార్టీలు



కైలాస్‌నగర్: జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి భానుడి సెగ తగిలింది. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రధాన పార్టీల అభ్యర్థులు తీవ్రంగా శ్రమించాల్సి వస్తోంది. ఉదయం 10దాటిందంటే భానుడు భగ్గుమంటున్నాడు. సాయంత్రం ఆరు దాటినా ఎండ వేడి తగ్గడం లేదు. ప్రచార గడువు సమీపిస్తుండటంతో ఓటర్లను పూర్తిస్థాయిలో కలిసేందుకు సమయం లేక అభ్యర్థుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే నామినేషన్ల ఘట్టం ముగిసింది. కొద్ది రోజుల్లో ఉపసంహరించుకునేదెవరో.. బరిలో నిలిచేదెవరో తేలనుంది. ఆ తర్వాత పార్టీలు ప్రచారంలో మరింత వేగం పెంచనున్నాయి. కాగా, ఎండలు మండుతుండడంతో కార్యకర్తలు అభ్యర్థుల వెంట తిరిగేందుకు జంకుతున్నారు. భానుడి ఉగ్రరూపంతో జనాలు కూడా ప్రచారానికి వచ్చేందుకు వెనుకడుగు వేస్తున్నారు. దీంతో ఆయా పార్టీల ప్రచారంలో జోష్ కనిపించకుండా పోయింది. జిల్లా, మండల కేంద్రాలు, కొన్ని గ్రామాల్లోనే ప్రచార రథాలు కనిపిస్తున్నాయి. పలు గ్రామాలు, కాలనీల్లో అభ్యర్థులు లేకపోయినప్పటికీ ద్వితీయ శ్రేణి నాయకులతో ప్రచారం సాగుతోంది. అయితే అభ్యర్థులు రాకపోవడంతో ఓటర్లు ఇంకా ఎవరికి ఓటు వేయాలో తేల్చుకోలేక పోతున్నట్లు తెలుస్తోంది. తమను నేరుగా కలవలేదనే అభిప్రాయం వారిలో వ్యక్తమవుతోంది.

ప్రచారంలో కనిపించని జోష్

గత అసెంబ్లీ ఎన్నికల జోష్ ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో ఎక్కడా కనిపించడం లేదు. ఆదిలాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలుండగా.. 50 మండలాలున్నాయి. వీటి పరిధిలో 2,111 పోలింగ్ కేంద్రాలుండగా 16,44,715 మంది ఓటర్లున్నారు. ప్రస్తుత ఎన్నికల్లో ముగ్గురు ఆదివాసీ అభ్యర్థులే పోటీ పడుతుండటంతో పోరు రసవత్తరంగా మారింది. ఈ ఎన్నికల్లో విజయం సాధించాలంటే ప్రతీ ఓటు కీలకమైందే. ఈ నేపథ్యంలో ఓటర్లను కలిసే దిశగా అభ్యర్థులు ప్రచారం సాగిస్తున్నప్పటికీ పూర్తిస్థాయిలో కలిసే పరిస్థితి కనిపించడం లేదు. ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో ఉదయం, సాయంత్రం మాత్రమే ప్రచారం నిర్వహిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఊరు, వాడ, పల్లె, పట్టణమనే తేడా లేకుండా ఎమ్మెల్యే అభ్యర్థులు మొదలు ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తల వరకు విస్తృతంగా పర్యటించారు. ప్రతీ మండలం, గ్రామంలో ప్రచార జోరు సాగింది. ఈ ఎన్నికల్లో అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. ఆయా పార్టీల అభ్యర్థులే ప్రచారం సాగిస్తున్నారు. అక్కడక్కడా కొంతమంది ద్వితీయ శ్రేణి నాయకులు మాత్రమే ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ఎండల తీవ్రత కారణంగా ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు ప్రచారానికి వెనుకడుగు వేస్తున్నారు. దీంతో ఓటర్లను కలవడం అభ్యర్థులకు సవాల్‌గా మారింది.

ప్రచార రథాలతోనే సరిపెడుతూ..

ఓటర్లను నేరుగా కలిసి ప్రసన్నం చేసుకుంటేనే గాని ఓట్లు రాని పరిస్థితి నెలకొంది. ఇలాంటి తరుణంలో ప్రతీ ఓటరును కలుసుకోవడం అభ్యర్థులకు సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో తమ గుర్తునైనా ప్రజల వద్దకు చేర్చాలనే ఉద్దేశంతో ప్రచార రథాలను ఆయుధాలుగా వినియోగిస్తున్నారు. నియోజకవర్గానికి రెండు, మూడు ప్రచార రథాలను సిద్ధం చేసి వాటి పరిధిలోని గ్రామాల్లో తిప్పుతున్నారు. ప్రధాన పార్టీలన్నింటిలో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఎండల తీవ్రత కారణంగా ఓటర్ల వద్దకు వెళ్లలేని పరిస్థితి ఉండగా పార్టీ శ్రేణులతో సమావేశాలు నిర్వహిస్తూ గెలుపుదిశగా కృషి చేయాలంటూ పార్టీ ముఖ్య నాయకులు దిశానిర్దేశం చేస్తున్నారు. అయినప్పటికీ ప్రచారం ఊపందుకోవడడం లేదు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఎక్కడ చూసినా ప్రచార జోష్ కనిపించడం లేదు. ప్రచార సరళిపై ఆందోళన వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు వీలైనంత మంది ఎక్కువ ఓటర్లను కలిసేలా కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నారు. ఎక్కువ మంది ఓటర్లున్న చోటకు వెళ్తూ ఓట్లు అభ్యర్థించేలా కార్యాచరణ రూపొందించుకుంటున్నారు.

ఓటు వినియోగంపై అవగాహన

నార్నూర్: భారత ఎన్నికల సంఘం ఆదేశానుసారం కలెక్టర్ రాజర్షి షా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'సిస్టమేటిక్ ఓటర్ ఎలక్టోరల్ ఎడ్యుకేషన్ పార్టిసిపేషన్ ప్రోగ్రాం' ఎన్నికల ప్రచార రథం ద్వారా శనివారం మండల కేంద్రంలో ఓటు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ఓటును దుర్వినియోగం చేయవద్దని తెలిపారు. ప్రలోభాలకు లోనుకాకుండా మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జవహర్, నాయబ్ తహసీల్దార్ అమృత్‌లాల్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

నార్నూర్: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై రవికుమార్ కథనం ప్రకారం.. మండలంలోని చోర్గవ్ గ్రామానికి చెందిన నస్తే మల్కాన్‌సింగ్ (40) గత వారం నుంచి తాగిన మైకంలో తరచూ ఇంట్లో గొడవపడేవాడు. రెండు రోజుల క్రితం గ్రామంలో బంధువుల అమ్మాయి ఉండగా అక్కడే తాగిన మైకంలో గొడవకు దిగడంతో భార్య, తండ్రి మందలించారు. తరచూ తాగి గొడవ దిగుతుండడంతో శనివారం సాయంత్రం తండ్రి మందలించడంతో మనస్తాపం చెందాడు. ఇంట్లో మల్కాన్‌సింగ్ పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు గమనించి ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య సుస్మిత, ఒక కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మొక్కజొన్న పంట దగ్ధం



దగ్ధమైన మొక్కజొన్న కంకులను చూపిస్తున్న రైతు

కుంటాల: మండలంలోని విఠాపూర్‌కు చెందిన రైతు గల్లాపురం రమేశ్ మొక్కజొన్న పంట శనివారం దగ్ధమైంది. ఈ యాసంగి సీజన్‌లో రమేశ్ ఎకరంలో మొక్కజొన్న సాగు చేశాడు. ప్రమాదశాత్తు నిప్పంటుకొని అర ఎకరం మొక్కజొన్న దగ్ధమైంది. రూ.55వేల వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం పరిహారం అందించాలని బాధిత రైతు కోరాడు.

గోవుల పట్టివేత

భైంసాటౌన్: అక్రమంగా గోవులను తరలిస్తున్న వాహనాన్ని పట్టణ పోలీసులు శనివారం సాయంత్రం పట్టుకున్నారు. భైంసా నుంచి పాలజ్‌కు వాహనంలో గోవులను తరలిస్తుండగా పట్టణ శివారులోని గడ్డెన్న వాగు ప్రాజెక్ట్ సమీపంలో పట్టుకున్నారు. ఈ మేరకు గోవులను స్వాధీనం చేసుకుని స్థానిక గోశాల నిర్వాహకులకు అప్పగించారు.

పునరావాసకాలనీని సందర్శించిన ఎఫ్‌డీపీటీ



కాలనీని పరిశీలిస్తున్న ఎఫ్‌డీపీటీ

కడెం: మండలంలోని కొత్త మద్దిపడగ గ్రామ సమీపంలో రాంపూర్, మైసంపేట్ గ్రామస్తులకు ఏర్పాటు చేసిన పునరావాస కాలనీని శనివారం అమ్రాబాద్ ఎఫ్‌డీపీటీ క్షితిజ సందర్శించారు. ఇళ్ల నిర్మాణాలు, సౌకర్యాలను పరిశీలించి పునరావాస కాలనీ వాసులతో మాట్లాడారు. రాబోయే రోజుల్లో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లోని గ్రామాలను తరలించనున్నందువల్ల కాలనీని సందర్శించినట్లు ఆమె పేర్కొన్నారు. ఆమె వెంట హైటికాస్ ఎన్‌జీవో ఫౌండర్ ఇమ్రాన్, ప్రతినిధి వెంకట్, ఎఫ్‌డీవో భవాని శంకర్, ఎఫ్ఆర్వో అనిత, అటవీ సిబ్బంది ఉన్నారు.

మిస్సింగ్ కేసు



సాయన్న

కుంటాల: మండల కేంద్రానికి చెందిన చందల సాయన్న (54) కనిపించడం లేదని కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై రజినీకాంత్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..సాయన్న తమ్ముడు సురేష్ హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈనెల 24న తమ్ముడిని చూడడానికి వెళ్లి శనివారం వరకు తిరిగి రాలేదు. సాయన్నకు భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

శుభ విరామం..!

- మూఢం, ఆషాఢమాసం
- వివాహ ఘడియలకు నేడు చివరిరోజు
- ఇక ఆగస్టు వరకు ఆగాల్సిందే..



నిర్మల్‌ఖిల్లా: పెళ్లిళ్లు, శుభకార్యాలకు ఆదివారం నుంచి బ్రేక్ పడనుంది. గురుమూఢం ప్రారంభంతో జూలై 8 వరకు ఎలాంటి ముహూర్తాలు లేవని వేద పండితులు వెల్లడిస్తున్నారు. ఆ తర్వాత ఆషాడమాసం ప్రారంభం కానుండడంతో పెళ్లిళ్లు శుభకార్యాలు ఉండవు. శ్రావణమాసం ఆగస్టులో కొత్త ముహూర్తాలున్నట్లు ప్రముఖ వేదపండితుడు సముద్రాల శ్రీకాంతాచార్యులు 'సాక్షి'తో పేర్కొంటున్నారు.

గ్రహాలస్థితిని బట్టి మూఢం..

వివాహ తదితర శుభకార్యాలకు గ్రహాల స్థితిని బట్టి ముహూర్తాలు నిర్వహిస్తారు. జ్యోతిష్యులు చెబుతున్నా వివరాల ప్రకారం గురుగ్రహం సూర్యుడికి దగ్గరగా వచ్చినప్పుడు గురుమౌఢ్యంగా, శుక్రగ్రహం సూర్యగ్రహానికి దగ్గరగా వచ్చినప్పుడు శుక్రమౌఢ్యంగా పిలుస్తారు. ఈ కాలాన్ని ఏవైనా నూతన పనుల ప్రారంభం లేదా వివాహ బంధం ఏర్పడడానికి అశుభంగా భావిస్తూ పనులు వాయిదా వేస్తారు. ఈ సంవత్సరం శుభకార్యాలు ఆశ్వయుజమాసంలో మొదలయ్యాయి. ఒక పుష్యమాసంలో తప్ప మిగతా కార్తీక, మాఘ, చైత్రమాసాల్లో పెళ్లిళ్లు, గృహప్రవేశాలు, ఇతర శుభకార్యాలు పెద్దఎత్తున జరిగాయి. కొన్ని సందర్భాల్లో అత్యవసరంగా భావించేవారు కొన్ని అనుకూలతలు దృష్టిలో ఉంచుకొని ముహూర్తాలు పెట్టుకున్నారు. అయితే గత నాలుగైదు నెలల కాలంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా దాదాపు 10 వేలకు పైగా పెళ్లిళ్లు జరిగాయని పురోహితులు అంచనా వేస్తున్నారు.

ఎన్నికల హడావుడితో కాస్త ఉపశమనం

ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల హడావుడి కొనసాగుతోంది. వీటి తర్వాత స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీ ఎన్నికలు ఉండనున్నట్లు తెలుస్తోంది. అయితే వివిధ వృత్తుల్లో ఉపాధి పొందుతున్న వారికి ఎన్నికల హడావుడి ద్వారా ఉపశమనం లభించనుంది. ఇప్పటికే ఇక పెళ్లిళ్ల సీజన్‌కు విరామం ఏర్పడనుండడంతో ఎన్నికల సీజన్ మరో అవకాశంగా లభించనుంది. ప్రధానంగా పార్టీల ప్రచారం కోసం టిఫిన్లు, భోజనాలు, తయారీ టెంట్ హౌస్ సామాన్లు, వాహనాలు, కూలీల అవసరం ఉండనుంది.

ఇక ఆగస్టు 8 వరకు విరామం

ఆదివారం పెళ్లిళ్లు, శుభకార్యాలకు చివరిరోజు కావడంతో ఇక ఆగస్టు వరకు శుభకార్యాలకు బ్రేక్ పడనున్నాయి. ఆగస్టు 8 తర్వాతే జరగనున్నాయి. అప్పటివరకు వీటిపై ఆధారపడిన వృత్తుల వారు, బ్యాండ్, వాయిద్యా కళాకారులు, ఈవెంట్ నిర్వాహకులు, టెంట్ హౌస్ యాజమాన్యాలు, పూలు, క్యాటరింగ్ తదితర రంగాల్లో ఉపాధి పొందుతున్నవారు విశ్రాంతి తీసుకోవాల్సిందేనని చెబుతున్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

- యువకుడికి తీవ్ర గాయాలు



లారీని ఢీకొన్న కారు

నర్సాపూర్(జి): రోడ్డుపై ఆగి ఉన్న లారీని కారు ఢీకొన్న ఘటనలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై హన్మాండ్లు కథనం ప్రకారం.. భైంసా మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కదం దినేష్ కుమార్ నిర్మల్‌లో పని ముగించుకుని కారులో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత స్వగ్రామానికి వెళ్తున్నాడు. నర్సాపూర్ (జి) మండలం చాక్‌పల్లి శివారు 61వ జాతీయ రహదారిపై నిలిపి ఉన్న లారీని ఢీకొంది. ఈ ఘటనలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. అంబులెన్స్‌లో క్షతగాత్రుడిని భైంసాలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. యువకుడి తండ్రి ఆనంద్‌రావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం



లోకేశ్వరం: మండలంలోని కన్నపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2004-05 బ్యాచ్ పదో తరగతి పూర్వవిద్యార్థులు శనివారం కలిశారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం తర్వాత యోగాక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వీరి అపూర్వ సమ్మేళనానికి పాఠశాల వేదికైంది. పాఠశాలలో చిన్ననాటి తీపి గుర్తులను నెమరువేసుకున్నారు. రోజంతా సంతోషంగా గడిపారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులు సుధాకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, గంగాధర్, సరిత, సత్యాపాల్‌రెడ్డి, కిష్టారెడ్డిలను సన్మానించారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి



వినోద్ మృతదేహం

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని రాయల్‌గార్డెన్ సమీపంలో సంజీవయ్యకాలనీకి చెందిన యువకుడు బొమ్మెన వినోద్ (30) అనుమానాస్పదంగా మృతిచెందాడు. పట్టణ సీఐ శంకరయ్య, ఎస్సై అంజయ్య తమ సిబ్బందితో శనివారం ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒకేరోజు మూడు చోరీలు



బీరువాను పరిశీలిస్తున్న డీఎస్పీ కరుణాకర్

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణం, మండలంలో ఒకేరోజు చోరీలు జరిగాయి. పట్టణంలోని పెట్రోల్‌పంపు ఏరియాలో ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న మున్నీ బార్ అండ్‌రెస్టారెంట్‌లో శనివారం తెల్లవారుజాము 3.30 గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి రెస్టారెంట్‌పై ఇనుప రేకును తొలగించి వైన్స్ గదిలో చొరబడ్డారు. రూ.3 లక్షల నగదును ఎత్తుకెళ్లారు. రెస్టారెంట్‌లో ఉన్న సీసీ కెమెరాల్లో దొంగతనం చేసిన వ్యక్తి ముఖానికి నలుపు రంగు వస్త్రాన్ని ధరించి ఉన్నారు. మండలంలోని భట్‌పల్లి గ్రామానికి చెందిన తోట శోభ ఇంటి తాళం పగులగొట్టి దొంగలు బీరువా తాళం తొలగించి మూడున్నర తులాల బంగారంతో పాటు రూ.50 వేల నగదు చోరీకి గురైంది. ఫింగర్‌ప్రింట్స్, డాగ్‌స్క్వాడ్ బృందాలతో సంఘటన జరిగిన స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. డీఎస్పీ కరుణాకర్, పట్టణ సీఐ శంకరయ్య, రూరల్ ఎస్సై సోనియా, పట్టణ ఎస్సై అంజయ్య, మహేందర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం



దగ్ధమవుతున్న ఇల్లు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని సాలెవాడ(బి) గ్రామంలో గేడం జంగుకు చెందిన ఇల్లు శనివారం ప్రమాదశాత్తు దగ్ధమైంది. ఆ సమయంలో కుటుంబ సభ్యులు గ్రామంలో జరిగిన పెళ్లికి వెళ్లారు. ఇంట్లో మంటలు వ్యాపించడంతో వంట సామగ్రితోపాటు రూ.25 వేల నగదు, పట్టా పాస్ పుస్తకాలు, బ్యాంకు పుస్తకాలు కాలిపోయాయి. సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని, ఐటీడీఏ అధికారులు పేద కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు గిరిజనులు కోరుతున్నారు.

రూ.2.96 లక్షల నగదు పట్టివేత

తాండూర్: తాండూర్ నుంచి మహారాష్ట్రకు వెళ్తున్న ఓ కారులో నుంచి పోలీసులు నగదు పట్టుకున్నారు. ఎస్సై జగదీశ్ కథనం ప్రకారం..తాండూర్ ఐబీ శని వారం వారసంత ప్రాంతంలో శనివారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో మహారాష్ట్ర వైపు వెళ్తున్న కారును ఆపి తనిఖీ చేయడంతో కారులో ఉన్న శాంకరి మహేశ్ వద్ద రూ.2.96 లక్షలు లభించాయని ఎస్సై తెలిపారు. ఎలాంటి ధ్రువపత్రాలు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

మద్యం పట్టివేత

కడెం: మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన వెల్పుల రాజన్న కిరాణా షాపులో శనివారం మద్యం పట్టుకున్నట్లు ఎస్సై కృష్ణాసాగర్‌రెడ్డి తెలిపారు. పట్టుబడిన మద్యం విలువ రూ.11 వేలు ఉంటుందని పేర్కొన్నారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న రాజన్నపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భీమారంలో..



పట్టుకున్న మద్యం, నిందితులతో ఎస్సై

భీమారం: అక్రమంగా వాహనంలో తరలిస్తున్న రూ.2 లక్షల విలువ గల మద్యం బాటిళ్లను మండలంలోని మాంతమ్మ ఆలయ సమీపంలో జాతీయ రహదారి వద్ద శనివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై బి.రాములు కథనం ప్రకారం.. మంచిర్యాల నుంచి మహారాష్ట్ర వైపు టాటాఏసీ వాహనంలో మద్యం తరలిస్తున్నారనే సమాచారంతో భీమారం-జైపూర్ మధ్య జాతీయ రహదారి వద్ద టాస్క్‌ఫోర్స్ ఎస్సై లచ్చన్న సిబ్బందితో కాపు కాశారు. అనుమానాస్పదంగా వస్తున్న టాటాఏసీ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా మద్యం కాటన్లు లభ్యమయ్యాయి. కోటపల్లి మండలం అన్నారం గ్రామానికి చెందిన డ్రైవర్ మహ్మద్ షరీఫ్, తిప్పారపు రమణయ్యను విచారించారు. మద్యాన్ని మహారాష్ట్రకి తరలిస్తున్నామని ఒప్పుకున్నారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్న టాటాఏసీతోపాటు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుడుంబా విక్రయిస్తే కేసులు



పట్టుకున్న గుడుంబాతో ఎస్సై శంకర్

పెంబి: గుడుంబా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై శంకర్ హెచ్చరించారు. మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి వద్ద విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న 15 లీటర్ల గుడుంబాను శనివారం పట్టుకున్నామని తెలిపారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది ధన్‌రాజ్, ప్రసాద్ ఉన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు



పోలీసుల అదుపులో గంజాయి విక్రయదారు

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో గంజాయి విక్రయించేందుకు వచ్చిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ బన్సీలాల్ తెలిపారు. పక్కా సమాచారంతోనే రైల్వేస్టేషన్ ఏ క్యాబిన్, పోచమ్మ టెంపుల్ ప్రాంతాల్లో శనివారం సీఐ సిబ్బందితో కలిసి తనిఖీ చేపట్టారు. అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తి వద్ద 250 గ్రాముల గంజాయి, హుక్కా లభించింది. సదరు వ్యక్తి వివరాలు సేకరించగా కలకత్తాకు చెందిన దేవనాత్ రాయ్(25) మహారాష్ట్ర నుంచి గంజాయి తెచ్చి మంచిర్యాల రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారని చెప్పాడు. ఇతడు బతుకుదెరువు కోసం రైళ్లలో సమోసాలు అమ్మితే వచ్చే డబ్బులు సరిపోకనే గంజాయి అమ్ముతున్నాడు. ఈక్రమంలో అతడు గంజాయికి బానిసయ్యాడు. ఈనెల 26న బల్లార్షకు వెళ్లి 1250 గ్రాముల గంజాయి కొనుగోలు చేసుకొని వచ్చాడు. శనివారం పోచమ్మగుడి వద్ద గంజాయి తాగి అక్కడికి వచ్చే వారికి విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నాడు. పోలీసులు అతని తనిఖీ చేయగా 250 గ్రాముల గంజాయి తోపాటు తాగేందుకు ఉపయోగించే హుక్కాను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.

కంచె ఏర్పాటు వద్దని ఆందోళన



నర్సరీలో మొక్కలు ధ్వంసం చేస్తున్న గ్రామస్తులు

- అటవీ అధికారులను అడ్డుకున్న కొత్త మద్దిపడగ వాసులు
- నర్సరీలో మొక్కలు ధ్వంసం



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి

కడెం: మండలంలోని కొత్త మద్దిపడగ సమీపంలో ఏర్పాటు చేసిన పునరావాసకాలనీ పక్కన ఇనుప కంచె ఏర్పాటు వద్దని శనివారం గ్రామస్తులు ఆందోళనకు దిగారు. కంచె ఏర్పాటుకు కొలతలు తీస్తుండగా అటవీ సిబ్బందిని అడ్డుకుని పక్కనే ఉన్న అటవీ నర్సరీలో మొక్కలను ధ్వంసం చేసి, రోడ్డుపై పారేశారు. అధికారులను తరిమారు. కలెక్టర్, అటవీ ఉన్నతాధికారులు రావాలని ఆందోళన చేశారు. సీఐ సైదారావు, ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి అక్కడికి చేరుకుని గ్రామస్తులకు నచ్చచెప్పి ఆందోళన విరమింపజేశారు. పునరావాస కాలనీ పక్కన ఉన్న స్థలంలో తాతాల కాలం నుంచి జమ్మి గద్దె, వడ్ల కల్లం ఏర్పాటు చేసుకుంటున్నామని, ఆ స్థలం నుంచే వైకుంఠధామానికి వెళ్లాలని, ఇప్పుడు కంచె ఏర్పాటు చేస్తే ఇబ్బంది కలుగుతుందన్నారు. కల్లం కోసం స్థలం ఇస్తామని అప్పటి కలెక్టర్ వరుణ్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. కంచె ఏర్పాటు మానుకుని, కల్లం కోసం స్థలం ఇవ్వాలని లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు.

అడ్డుకోవడం సరికాదు

కంచె ఏర్పాటును కొత్త మద్దిపడగ వాసులు అడ్డుకోవడం సరికాదు. అటవీ భూమి 2015లో పునరావాసకాలనీ ఏర్పాటుకు ఇచ్చాం. వడ్ల కల్లం స్థలం కోసం కలెక్టర్‌ను కలవకుండా, ప్రభుత్వ నర్సరీని ధ్వంసం చేయడం సరికాదు. వడ్ల కల్లం కోసం అటవీ భూములను ఇవ్వరాదు. అటవీ అధికారుల విధులకు ఆటంకం కల్గించిన పలువురిపై కేసులు నమోదు చేశాం.

– చోలే అనిత, ఎఫ్ఆర్వో

అనుమతి లేని ఫ్లెక్సీల తొలగింపు



మున్సిపల్ కమిషనర్ రాజుతో వాగ్వాదానికి దిగిన బీజేపీ నాయకులు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలో అనుమతి లేని ఫ్లెక్సీలను తొలగింపునకు ఎన్నికల సిబ్బంది చర్యలు తీసుకున్నారు. స్థానిక బస్‌డిపో సమీపంలో ఓ జాతీయ పార్టీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని శనివారం తొలగించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలు ఎన్నికల కమిషనర్ ఆదేశానుసారం అధికారుల అనుమతి తీసుకోవాలని సూచించారు. అనుమతి లేకుండా బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే తొలగిస్తామని హెచ్చరించారు.

ఫ్లెక్సీ తొలగించడంపై వివాదం

జిల్లా కేంద్రంలో ఫ్లెక్సీల వివాదం చర్చనీయాంశంగా మారింది. తమకు సంబంధించిన ఫ్లెక్సీలు తొలగించడం సరైంది కాదని బీజేపీ నాయకులు ఆందోళనకు దిగారు. ఎలక్షన్ కమిషనర్ పర్మిషన్‌తోనే ఫ్లెక్సీలు ఏర్పాటు చేశామన్నారు. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా తొలగించడంపై మండిపడ్డారు. అధికారులు కాంగ్రెస్ పార్టీకి కొమ్ము కాస్తున్నారని ఆగ్రహించారు.

రైస్‌మిల్లులో అగ్ని ప్రమాదం



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన విద్యుత్ సామగ్రి



బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్

- కాలిబూడిదైన విలువైన విద్యుత్ సామగ్రి
- రూ.6 లక్షల నష్టం

నెన్నెల: మండల కేంద్రంలోని బొమ్మెన శ్రీమతి రైస్ మిల్లులో శనివారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోయిన ఆస్తినష్టం వాటిల్లింది. సుమారు రూ.6 లక్షల విలువైన మెయిన్ విద్యుత్ వైర్లతో పాటు ప్యానల్ బోర్డు, విద్యుత్ స్టార్టర్‌లు, కెపాజిటర్లు, విద్యుత్ మీటర్లు కాలిబూడిదయ్యాయి. రైస్ మిల్లు యజమాని, ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం..రైస్‌మిల్లులో పని చేసే ఆపరేటర్ వెంకటేశ్ శనివారం ఉదయం 4.30 గంటల ప్రాంతంలో రైస్ మిల్లుకు వెళ్లి షెటర్ ఎత్తి చూడగా మంటలు చెలరేగుతూ కనిపించాయి. వెంటనే పక్కనే ఉన్న బోర్ మోటారుతో మంటలార్పేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అప్పటికే విలువైన విద్యుత్ సామగ్రి అగ్నికి ఆహుతైంది. రైస్‌మిల్లు యజమాని బొమ్మెన శ్రీమతి విచారణ చేపట్టాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయా? లేదా ఎవరైనా కావాలనే చేశారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. సంఘటన స్థలానికి బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్, విద్యుత్ ఏఈ మల్లయ్యకు చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే ఫోన్‌లో బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్‌తో మాట్లాడారు. విచారణ వెంటనే చేపట్టి రిపోర్ట్ త్వరగా అందజేయాలన్నారు. బొమ్మెన శ్రీమతి ఆమె కొడుకు హరీష్‌గౌడ్‌ను ఎమ్మెల్యే పరామర్శించి ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరగలేదని పోలీసులకు రిపోర్ట్ ఇచ్చినట్లు విద్యుత్ ఏఈ తెలిపారు. విద్యుత్ అధికారుల రిపోర్ట్ ఆధారంగా విచారణ చేపడుతున్నట్లు ఎస్సై ప్రసాద్ పేర్కొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి

- విద్యుత్ శాఖ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్‌రెడ్డి
- కౌటాలలో 132/33 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

కౌటాల(సిర్పూర్): హెచ్చుతగ్గులు లేకుండా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్‌శాఖ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. కౌటాల మండలం కోయగూడ సమీపంలో నిర్మిస్తున్న 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులను శనివారం పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటిస్తూ వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. గడువులోగా పనులు పూర్తి చేయకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం కౌటాల విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం, ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కౌటాల, బెజ్జూర్, చింతలమానెపల్లి మండలాల్లో అటవీ ప్రాంతం నుంచి విద్యుత్ తీగలు ఉండడంతో ఈదురు గాలులకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. వేగంగా మరమ్మతులు చేపడుతూ.. ఆయా ప్రాంతాల్లో ప్రజలకు ముందస్తు అంతరాయంపై సమాచారం ఇవ్వాలని సూచించారు. వేసవి నేపథ్యంలో ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరుపై దృష్టి సారించాలన్నారు. సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సెల్‌ఫోన్ అప్పగింత



ఫోన్ అప్పగిస్తున్న ఎస్‌హెచ్‌వో

బెల్లంపల్లి: ప్రమాదవశాత్తు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ఎట్టకేలకు పట్టుకుని బాధితుడికి పోలీసులు అప్పగించారు. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎస్.దేవయ్య కథనం ప్రకారం.. పట్టణంలోని అంబేద్కర్ నగర్ బస్తీలో నివాసం ఉంటున్న గొర్ల బానేశ్ అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు గత జులైలో బైక్‌పై ఇంటికి వెళ్తుండగా సెల్‌ఫోన్ పా గొట్టుకున్నాడు. దారెంట వెతికిన దొరకలేదు. ఈ ఘటనపై వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశాడు. కే సు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇన్నాళ్లు సదరు సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉండగా తాజాగా ఆన్ చేశారు. దీంతో సమాచా రం అందుకుని ఓ మొబైల్ షాపులో ఓ వ్యక్తి అ మ్మకం చేసిన బానేశ్ సెల్‌ఫోన్‌ను స్వాధీనం చే సుకుని బాధితుడికి ఎస్‌హెచ్‌ఓ అప్పగించారు.